ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కొత్త అల్లుళ్లకు బాహుబలి విందు.. 7లో

ఊరంతా సంక్రాంతి



కోడి పందేల హోరు

గుండాటల జోరు



అచ్చంపేట జంక్షన్‌లో ..

కాకినాడ జిల్లాలో జూద జాతర

(కాకినాడ, ఆంధ్రజ్యోతి) సంక్రాంతి పండగ నేపథ్యంలో జిల్లాలో కోడిపందేల జాతర కొనసాగింది. పందెంరాయుళ్ల పోటీతో పుంజులు బరుల్లో పోటాపోటీగా తలపడ్డాయి. దీంతో కోట్లలో కట్టలు తెగిపడ్డాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడికక్కడ బరుల్లో నువ్వానేనా అన్నట్లు పండగ మూడు రోజులో జిల్లాలో పందేలు జరిగాయి. మూడురోజులపాటు రేయింబవళ్లు కోడి పందేలు హోరెత్తాయి. సంక్రాంతి రోజైతే ఏకంగా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి మరీ పందెం రాయుళ్లు పోటీపడ్డారు. పందేలు కాయడానికి వచ్చే వారిని ఆకట్టుకునేందుకు భారీ షామియానాలు, కుర్చీలు, లైవ్‌షోలు, డ్యాన్సులు, విందు ఏర్పాటు చేయడంతో బరులన్నీ జాతరలను తలపించాయి. బరులను ఆనుకుని గుండాట వ్యాపారం కోట్లలో జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు గుండాట బోర్డులు నిర్వాహకులకు కోట్లలో కాసులు కురిపించాయి.

కాకినాడ జిల్లావ్యాప్తంగా..

కాకినాడ జిల్లావ్యాప్తంగా మూడురోజుల్లో కోడిపందేలు, గుండాట కలిపి రూ.250కోట్లకుపైగా వ్యాపారం జరిగింది. పోలీసులు సైతం బరులవైపు కన్నెత్తి చూడకపోవడంతో పందెంరాయుళ్లు బరితెగించేశారు. దీంతో జిల్లావ్యాప్తంగా 490వరకు బరులు ఏర్పాట్లయ్యాయి. కరప, కాకినాడ రూరల్ మండలాల్లో కోడి పందేల విజేతలకు బుల్లెట్లు, కారు బహుమతులుగా ఇవ్వడంతో పందెంరాయుళ్లు విరగబడ్డారు. తుని నియోజకవర్గం పరిధిలో కోటనందూరు, తుని, తొండంగిలో పోలవరం కాలువ వెంబడి, హైవే తోటల్లోను భారీగా బరులు నిర్వహించారు. పెద్దపెద్ద టెంట్లు, లైట్లు ఏర్పాటు చేసి పందేలు ఆడించారు. తుని నియోజకవర్గంలో పందేలు, గుండాట, పేకాట కలిపి రూ.15కోట్లకుపైగా లావాదేవీలు జరిగాయి. ప్రత్తిపాడులో ఓ గ్రామంలో ఏర్పాటు చేసిన గుండాట వ్యాపారికి మూడురోజుల్లో రూ.25లక్షల లాభం వచ్చింది. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో పామాయిల్ తోటల్లో మూడురోజులపాటు జరిగిన కోడిపందేలు, గుండాట జిల్లాలోనే రెండోస్థానంలో నిలిచాయి. తెలంగాణనుంచి సైతం పందెంరాయుళ్లు రావడంతో ఒక్కో బరిలో కోట్లలో వ్యాపారం జరిగింది. జగ్గంపేటలో ఓ బరిని రూ.36లక్షలకు వేలంలో పాడుకున్న ఓ నిర్వాహకుడు అంతకు రెండింతలు గడించారు. సామర్లకోటలో ఏకంగా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి పందేలు ఆడించారు. నియోజకవర్గంలో దాదాపు రూ.45కోట్ల వరకు లావాదేవీలు జరగ్గా గుండాట వ్యాపారమే రూ.32కోట్ల వరకు ఉంది. పిఠాపురం నియోజకవర్గం మొత్తం 80వరకు బరుల్లో పందేలు, గుండాట కలిపి రూ.25కోట్ల వరకు లావాదేవీలు జరిగాయి. కాకినాడ రూరల్‌లో ఒక్కో బరిని కొందరు రూ.30లక్షల నుంచి రూ.38లక్షలకు వేలంలో దక్కించుకోవడంతో పందెంరాయుళ్లను ఆకర్షించడానికి అనేక ఎత్తులు వేశారు. కరప మండలం కొరుపల్లిలో మూడురోజుల్లో అత్యధికంగా పందేలు గెలిచిన విజేత దేగల నాగేంద్ర అలియాస్ గోల్డ్‌బాబుకు రూ.18లక్షలు విలువ చేసే మహీంద్రా థార్ వాహనాన్ని నిర్వాహకులు అందజేశారు. పెదపూడి,తాళ్లరేవు,కాజులూరు మండలాల్లో రూ.5కోట్ల చొప్పున గుండాట వ్యాపారం జరిగింది.



రూ.200 కోట్ల పందేల సందడి

రాజమహేంద్రవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో మూడురోజులపాటు కోడిపందేలు, గుండాటలు, పేకాటల పేరిట రూ.200కోట్ల లావాదేవీలు జరిగినట్టు అంచనా. బరుల నిర్వాహకులకు గుండాట బోర్డులు తీసుకున్నవారు రూ.13కోట్ల వరకూ ఇచ్చారు. 18 మండలాల పరిధిలో ఒక్కో మండలానికి కనీసం 7 కోడిపందేల బరుల వంతున జిల్లాలో మొత్తం 125 బరుల వరకూ నడిచాయి. కోడిపందేల నిర్వాహకులు ముందుగా గుండాటలు, పేకాట నిర్వాహకులతో ఒప్పందం పెట్టుకున్నారు. గుండాట నిర్వాహకులు ఒక్కో బరికి కనీసం రూ.10లక్షలు ముందుగానే కోడిపందేల బరి నిర్వాహకులకు అందజేయాలని ఒప్పందం చేసుకున్నారు. రాజానగరంలో 10 గుండాట బోర్డులు పెట్టుకోవడానికి రూ.21లక్షలు నిర్వాహకులకు చెల్లించినట్టు సమాచారం. తూర్పుగోదావరి జిల్లాలో పోలీసులకు రూ.2.5కోట్ల నుంచి 3కోట్ల ముడుపులు అందినట్టు అంచనా. ఒక్కో బరి నిర్వాహకులు కనీసం 4 నుంచి 6 కేసులు పోలీసులకు అప్పగించేలా ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం. భోగి నుంచి మొదలైన పందేలు కనుమరోజు సాయంకాలం ఐదుగంటలకే ముగియాల్సి ఉన్నా చాలాచోట్ల ఆరు, ఆరున్నర గంటలకు నిలిపివేశారు.

కోనసీమ జిల్లాలో కోట్లాట

చేతులు మారిన కోట్లాది రూపాయలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా సంక్రాంతి మూడురోజు నిర్వహించిన జూదాలు, పందేల్లో రూ.75కోట్ల మేర చేతులు మారినట్టు సమాచారం. పందేలు, రికార్డింగ్ డ్యాన్సులు యథేచ్ఛగా నిర్వహించినా కొందరు పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. మురమళ్ల, చెయ్యేరు, కేశనకుర్రుపాలెం, రాజుపాలెం, రోళ్లపాలెం, గెద్దనపల్లి, గోడి, గోడిలంక, కామనగరువు, సమనస, పేరూరు, ఇందుపల్లిగరువు, రావులపాడు, వెదిరేశ్వరం, శివకోడు, మామిడికుదురు, అల్లవరం, ఠాణేలంక, కొత్తలంక, లొల్ల, పేరవరం, తాడిపూడి, ర్యాలి, నాగుల్లంక, మానేపల్లి, వాడ్రేవుపల్లిల్లో జాతీయ రహదారిని ఆనుకుని శివకోడు, వీవీ మెరక సబ్‌స్టేషన్, గున్నేపల్లి అగ్రహారం, కొంకాపల్లి, నడవపల్లి, గోగన్నమఠం, పాశర్లపూడి, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లిలంకతో పాటు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధితో సహా 400కు పైగా కీలక ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. కీలక బరులు వద్ద కోడిపందాలు, గుండాట, పేకాట వంటి పోటీల ద్వారా కోట్లాది రూపాయిల మేర లావాదేవీలు జరిగినట్టు అంచనా. అమలాపురం, కాకినాడ ఎంపీలు గంటి హరీష్‌మాధుర్, తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందతోపాటు అనేకమంది కూటమికి చెందిన కీలక నేతలు, ప్రజాప్రతినిధులు హాజరై తిలకించారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం బీచ్‌లో సంక్రాంతి సంబరాల పేరిట ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో మూడురోజులపాటు ఉత్సవాల్లో కోడిపందేలు, గుండాట, బైక్ రైడింగ్‌లతోపాటు రాత్రివేళల్లో జబర్దస్త్ బృందాల ఆధ్వర్యంలో డ్యాన్సులు, హాస్యవల్లరి కార్యక్రమాలు నిర్వహించారు. రాజోలు మండలం పాలగుమ్మిలో పందెం బరి వద్ద రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీయడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జిల్లాలో పలుచోట్ల సంక్రాంతి ఉత్సవాల ముసుగులో అశ్లీల నృత్యాలు హోరెత్తించాయి.



రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యిలో



కొవ్వూరు మండలం పశివేదలలో..



ఐ.పోలవరం: పోటీలను తిలకిస్తున్న నేతలు



కరప: గొర్రిపూడి బరిలో గుండాట



తాళ్లపూడి:పందెంలో గెలుచుకున్న బుల్లెట్



కరప: జీపును గెలుచుకున్న గోల్డ్‌బాబు



రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలో కోడి పందాల విజేతకు బుల్లెట్ బహుమతి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఎస్.యానాం బీచ్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



జబర్దస్త్ స్కిట్

ఉప్పలగుప్తం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం బీచ్‌లో సంక్రాంతి ఉత్సవాలు జనరంజకంగా కొనసాగుతున్నాయి. రోజురోజుకూ పర్యాటకుల తాకిడి పెరగడంతో నిర్వాహకులు మరింత ఉత్సాహంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఉత్సవాలకు తరలి వస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రద్దీ పెరగడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. రెండో రహదారి నిర్మించినప్పటికీ రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. సంక్రాంతి రోజు రాత్రి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కమిటీ సభ్యులు ట్రాఫిక్ నియంత్రణ విధులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంగళవారం సముద్ర తీరాన పిల్లల కోసం గుర్రపు స్వారీ, శాండ్ బైక్ రైడ్ వంటి ఏర్పాట్లు చేశారు. రాత్రి ఎనిమిది గంటల వరకు మ్యాజిక్ షోలు, మిమిక్రీ ప్రదర్శనలు, భరతనాట్యం, ఆర్కెస్ట్రా తదితర వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి సినీ హీరోయిన్ కామ్నాజెత్మాలనీ బీచ్‌లో సందడి చేసింది. జబర్దస్త్ ఆర్టిస్టుల స్కిట్లు, సంగీత విభావరి కార్యక్రమాలు ప్రేక్షకులకు వినోదాన్ని పంచాయి. బుధవారం ఆర్కెస్ట్రా, నృత్య ప్రదర్శనలు జరిగాయి. పర్యాటకులకు ప్రత్యేక ఫొటోషూట్‌కు అవకాశం కల్పించారు.



మాట్లాడుతున్న కామ్నా జెత్మాలనీ

విచ్చలవిడిగా అశ్లీల నృత్యాలు



అమలాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ఉత్సవాల ముసుగులో అశ్లీల నృత్యాలు జోరందుకున్నాయి. రాజోలు పోలీసు సర్కిల్ పరిధిలోను, మామిడికుదురు మండలం గోగన్నమఠం, ఆదుర్రు, లూటుకుర్రు, మగటపల్లి, కరవాక, రాజోలు మండలంలో పలుచోట్ల, మలికిపురం మండలంలోని కేశనపల్లి, పడమటిపాలెం, సఖినేటిపల్లి మండలంలో టేకిశెట్టిపాలెం, కేశవదాసుపాలెంలో రికార్డింగు డ్యాన్సులు, అశ్లీల నృత్యాలు హోరెత్తాయి. మగటపల్లిలో ట్రాఫిక్ జామ్ అయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఎప్పుడూలేని విధంగా రికార్డింగు డ్యాన్సులు వేయడం చర్చనీయాంశమైంది. బరుల వారీగా పోలీసులు రేట్లు నిర్ణయించి వసూళ్లకు దిగడం వల్లే ఈసారి డ్యాన్సులు మరింత హోరెత్తాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కొత్తపేటలో ప్రభల సంబరం



కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం వద్ద కొలువుదీరిన ప్రభలు



కొత్తపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవం వేలాది జనసందోహం మధ్య అంబరాన్నంటింది. రాష్ట్రం నలుమూలలు నుంచే కాకుండా విదేశాలలో స్థిరపడిన వారు సైతం ప్రభల ఉత్సవాన్ని తిలకించేందుకు విచ్చేశారు. బోడిపాలెం, కొత్త, పాత రామాలయం వీధుల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రభలను ఊరేగింపుగా తీసుకురాగా వాటి ముందు మేళతాళాలు, బ్యాండ్ వాయిద్యాలు, సంగీత విభావరులు, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రభలు ముందుకు నడిచాయి. భక్తుల సందర్శనార్థం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ప్రభలు కొలువయ్యాయి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, ఏపీ బీజేపీ ప్రచారక్ విజయ ఆదిత్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం తదితరులు మొక్కుబడులు తీర్చుకున్నారు. బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో డీఎస్పీ వై.గోవిందరావు పర్యవేక్షణలో రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



పంటచేలను దాటుతున్న వీరేశ్వరస్వామివారి ప్రభ

ప్రభయమానం



ఏకాదశ రుద్రుల కొలువు

జగ్గన్నతోటలో ఒకే చోట ఏకాదశ రుద్రులను ఒకే రోజు దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఏకాదశ రుద్రుల ఉత్సవంలో అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం మండలాల 11 గ్రామల నుంచి ప్రభలు మేళతాళ మంగళవాయిద్యాలతో ఉత్సవంలో కొలువుతీరాయి. వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి (విశ్వేశ్వరరుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి(సర్వేశ్వరరుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి (తికాగ్నికాలరుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి(శ్రీమన్మహాదేవరుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి (కాలాగ్ని రుద్రుడు), వక్కలంక విశ్వేశ్వరస్వామి (త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానాంత భోగేశ్వరస్వామి (నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మి చెన్నమల్లేశ్వరుడు (మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి(సదాశివరుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు)లను దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలంగా భావించి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

జగ్గన్నతోటలో అంగరంగ వైభవంగా ప్రభల తీర్థం

అంబాజీపేట, జనవరి15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం జగ్గన్నతోట, వాకలగరువు, చిరతపూడిలో సంక్రాంతి, కనుమ రోజు ప్రభల తీర్థాలు వైభవోపేతంగా జరిగాయి. అంబాజీపేట మండలం మొసలపల్లి జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల తీర్థ మహోత్సవం సందర్భంగా ఆ ప్రాంతం భక్తజన సంద్రంగా మరింది. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచే ఈ తీర్థానికి వేలాదిగా భక్తులు స్వాగతం పలికారు. ఇరుసుమండ, కె.పెదపూడి, మొసలపల్లి, గంగలకుర్రు నుంచి జగ్గన్నతోటకు వెళ్లే రహదారులు కిటకిటలాడాయి. జగ్గన్నతోటకు వివిధ గ్రామాల నుంచి 11 ప్రభలు తరలివచ్చాయి. తీర్థానికి వచ్చే ఇతర గ్రామాల ప్రభలకు స్వాగతం పలికే మొసలపల్లి మధుమానంత భోగేశ్వర స్వామి ప్రభ ఉదయం తొమ్మిది గంటలకే తీర్థంలో కొలువుదీరి స్వాగతం పలికింది. కౌశిక అవతల వైపు ఉన్న గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి ప్రభ, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ప్రభలు కౌశిక దాటి తీర్థంలోకి ప్రవేశించిన ఘట్టం చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. ప్రభలను యువకులు అవలీలగా భుజానకెత్తుకొని భక్తిభావంతో ముందుకు సాగారు. ఉదయం ఎనిమిది గంటలకే ఆయా గ్రామాల్లోని ప్రభలకు ప్రత్యేక పూజలను నిర్వహించి ఉత్సవ విగ్రహాలను ప్రభలపై కొలువుతీర్చి మేళతాళాలతో తీర్థానికి తీసుకువచ్చారు. చిరతపూడి చిట్టిచెరువు గట్టు, నరేంద్రపురం, అవిడి, రాకూర్తివారిపాలెం ప్రభలు చిరతపూడిలో కొలువుతీరాయి. వాకలగరువు, తొండవరం ప్రభలు తొండవరంలో కొలువుతీరాయి. తొండవరం, వాకలగరువు ప్రభలు ఒకదానికంటే ఒకటి పోటీపడి చూపరులను కనువిందు చేశాయి.

వీరేశ్వరస్వామి ప్రభ





అప్పర్ కౌశిక దాటుతున్న గంగలకుర్రు, జి.అగ్రహారం ప్రభలు





అధికారుల సేవలు భేష్

పోలీసులు ట్రాఫిక్ నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు, సీఐ రుద్రరాజు భీమరాజు పర్యవేక్షణలో ఎస్‌ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, డీఎస్పీ వై.గోవిందరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో జీవీ సరోవర్, తహశీల్దారు జె.వెంకటేశ్వరి, సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్‌ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అప్పర్ కౌశిక వద్ద ఇసుక బస్తాలు, తాగునీటి సౌకర్యంతో పాటు భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక సౌకర్యాలు చేపట్టారు.

లక్షకు పైగా..

జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవానికి ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు జగ్గన్నతోటలో జరిగే ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చినట్టు అంచనా.. జగ్గన్నతోట తీర్థంలో యువతి, యువకులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. తీర్థంలో రెండెడ్ల బండ్లు సందడి చేశాయి. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలు పంటచేలను తొక్కుకుంటూ, అప్పర్ కౌశిక దాటుతున్న దృశ్యాలను తన సెల్‌ఫోన్‌లో బంధించారు.



ఆతిథ్యం ఇచ్చి ఆహా అనిపించి

గోదావరి జిల్లాల్లో సంక్రాంతికి కొత్త అల్లుళ్లకు జరిగే మర్యాదలు అంతా ఇంతా కాదు.. పండక్కి అత్తవారి ఇంట్లో జరిగే అతిథి మర్యాదలతో పాటు వంటకాలు ఆహా అనిపించేలా ఉంటాయి. ఈ సారి కూడా పలుచోట్ల కొత్త అల్లుళ్లకు అదిరిపోయే ఆతిథ్యమిచ్చారు

660 రకాలతో...

అల్లవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరంలో కొత్త అల్లుడికి సంక్రాంతి పండుగ సందర్భంగా 660 రకాలతో విందు ఏర్పాటు చేశారు. స్వీట్లు, స్నాక్స్ వివిధ పానీయాలు, వెరైటీ పచ్చళ్లు, డ్రై ఫ్రూట్స్, తిరుపతి, అన్నవరం, విజయవాడ, అయినవిల్లి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల ప్రసాదాలు ఈ విందులో ఉన్నాయి. అల్లవరంలో జంగా వెంకటరత్నంనాయుడు (బుజ్జి) హైదరాబాద్‌కు చెందిన అల్లుడు గంధం హేమంత సాయిదుర్గాప్రసాద్ కోసం ఈ విందు ఏర్పాటు చేశారు. జర్మనీలో దుర్గాప్రసాద్ హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.



200 రకాలతో...

కపిలేశ్వరపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన గ్రంధి గోవిందరాజులు, మంగతాయారు దంపతులు హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికీ తమ అల్లుడికి 200కు పైగా పిండివంటలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. కాగా అల్లుడు పసుమర్తి గణపతి గుప్త, కూతురు తేజశ్వినిల తల్లిదండ్రుల స్వగృహాలు అంగర, ఏడిద కాగా గోవిందరాజులు, మంగతాయారు దంపతులు ఈ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు.

72 రకాలతో...

ఆలమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లలో కంచర్ల సూర్యనారాయణ ఇంట్లో సంక్రాంతికి వచ్చిన అల్లుళ్లు నవీన్, పవన్‌లకు 72 రకాల వంటకాలను వండించి సంక్రాంతి రుచులతో అదరగొట్టారు. భారీ అరటిఆకులో అల్లుళ్లు, కూతుళ్లకు ఒకేసారి వడ్డించారు.



అనపర్తిలో అంబరాన్నంటేలా...

వైభవంగా వీరుళ్లమ్మ జాతర

అమ్మవారిని దర్శించుకున్న లక్ష మందికి పైగా భక్తులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా





జాతరలో బాణసంచా కాల్పుల దృశ్యాలు

అనపర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తేర్చే కల్పవల్లిగా భక్తుల పూజలందుకుంటున్న అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం రాత్రి అంబరాన్నంటింది. సంక్రాంతి రోజు రాత్రి అమ్మవారికి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. రాత్రి 8 గంటలకు ఆలయం వద్దకు చేరుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులకు ఆలయ కమిటీ ప్రతినిధులు సత్తి వెంకటరామారెడ్డి, పడాల కళ్యాణ్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంత రం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనవాయితీగా వస్తున్న గరగను తలకెత్తుకుని ఎమ్మెల్యే జాతర ఉత్సవాలను ప్రారంభించారు. సుమారు లక్షమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవీచౌక్ నుంచి రైల్వే స్టేషన్ వరకు భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గరగ నృత్యాలతో బాటు, వివిధ ఆర్కెస్ట్రాలు, కోయ మేళాలు వంటి వి ఆకట్టుకున్నాయి. జబర్దస్త్ కళాకారులు ఆక ట్టుకున్నారు. అదేవిధంగా బాణసంచా కాల్పుల పోటీలు భక్తులకు కనువిందు చేశాయి. హైదరాబాద్ ఎగ్జిబిషన్ పేరుతో ఏర్పాటు చేసిన కొలంబస్, జెయింట్ వీల్, చిన్నారులకు బోటింగ్ వంటి అంశాలు ఆకట్టుకున్నాయి. బుధవారం అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీర సారెలతో మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా సీఐ సుమంత్, ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, భాస్కరరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, చింతా ప్రకాశరెడ్డి, బెండమూరి రాజు, ఒంటిమి సూర్యప్రకాష్ తదితరులున్నారు.



అనపర్తిలో గరగనెత్తుకుని జాతరను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. సంక్రాంతి, కనుమ 2రోజులు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది స్వామిని దర్శించుకున్నారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకోగా ఫొటోషూట్ల వద్ద భక్తజన సందడి కనిపించింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి 2 రోజుల్లో రూ.9 లక్షల 46 వేల 408 ఆదాయం లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తులు

పండుగ పూట కబళించిన మృత్యువు

భోగిమంటలో పడిన వ్యక్తి మృతి

వై.రామవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రెండు కాళ్లు లేకున్నా ఆత్మస్థైర్యంతో బ్రతుకు నీడ్చుకొస్తున్న అతడిని పండుగ పూట మృత్యువు కబళించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరానికి చెందిన పడాల నాగబాబు (49) సోమవారం అర్ధరాత్రి దాటక ఇంటి ముందు వేసిన భోగి మంట వద్ద కూర్చునేందుకు వెళ్లాడు. పీటపై నుంచి ప్రమాదవశాత్తు పడిపోయాడు. గతంలో అతడికి కాళ్లకు వ్యాపించిన వ్యాధులు కారణంగా రెండుసార్లు రెండు కాళ్లు తీసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి దయనీయ పరిస్థితిలో జీవనం సాగిస్తున్న అతడు భోగి మంటలో పడి మృతిచెందడంతో విషాదం నెలకొంది. నాగబాబును భార్య, కుటుంబీకులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని బుధవారం అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.



మృతిచెందిన నాగబాబు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో సతీష్‌కుమార్ మృతదేహం, (ఫైల్ ఫొటో)

తుని రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం డి.పోలవరం గ్రామానికి చెందిన అలమండ సతీష్‌కుమార్ (40) సోమవారం తెల్లవారుజామున తుని నుంచి డి.పోలవరం బైక్‌పై బయల్దేరాడు. తుని-నర్సీపట్నం రోడ్డులో డి.పోలవరం గండి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.200 ఇవ్వలేదని నిప్పంటించుకున్నాడు

ఖండవల్లిలో గుండాట వద్ద ఘర్షణ

పెరవలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోడి పందాల శిబిరం వద్ద ఏర్పాటు చేసిన గుండాటలో సొమ్ములు గెలుచుకున్నప్పటికీ డబ్బులు ఇవ్వకపోవడంతో ఒక యువకుడు ఆవేశానికి గురై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న సంఘటన పెరవలి మండలం ఖండవల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సంక్రాంతి సందర్భంగా ఖండవల్లిలో కోడిపందాల శిబిరం ఏర్పాటు చేశారు. అక్కడే గుండాటలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన కొమ్మిశెట్టి గంగాధర్(18) గుండాట ఆడుతూ రూ.200 కాశాడు. అయితే తాను గెలిచినప్పటికీ రూ.200 ఇవ్వకపోవడంతో గుండాట నిర్వాహకులతో తగవుపడ్డాడు. నీవు గెలవలేదని, నీకు డబ్బులు ఇవ్వాల్సినపనిలేదని నిర్వాహకులు చెప్పడంతో ఆవేశానికి గురైన యువకుడు మోటార్‌సైకిల్ నుంచి పెట్రోలు తీసి మీద పోసుకుని నిప్పంటించుకున్నాడు. అనంతరం భయాందోళనకు గురై పక్కనే ఉన్న నీళ్ల బోదెలోకి దూకాడు. అప్పటికే శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. స్థానికులు తణుకు ఆసుపత్రికి తరలించారు. అతడి ప్రాణాలకు ఏ ఇబ్బంది లేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఏ కేసు నమోదు చేయలేదు. ఇక్కడ కోడిపందాల శిబిరాన్ని ఈ సంఘటన జరిగిన అనంతరం మూయించివేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర్

నేటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

భోగాపురంలో

నాలుగురోజుల పాటు నిర్వహణ

పిఠాపురం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం కళాపరిషత్ తృతీయ వార్షిక నాటక మహోత్సవంలో భాగంగా ఈనెల 16వ తేదీ నుంచి కొణిదెల పవన్‌కల్యాణ్ జాతీయ స్థాయి నాటిక పోటీలు, వారాహి రంగస్థల విశిష్ట ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరగనున్నాయి. 19 వరకూ ఈ పోటీలు జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ సౌజన్యంతో పోటీలు నిర్వహిస్తున్నారు. 16న రాత్రి గుడివాడ కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కళాకారులు ద్వారబందాల చంద్రయ్యానాయుడు నాటిక, గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం మిట్టపాలెం కృష్ణా ఆర్ట్స్ థియేటర్స్ కళాకారులు ప్రేమించే వయసేనా నాటిక ప్రదర్శిస్తారు. 17న రాత్రి విశాఖపట్టణం ఉక్కునగరం చైతన్య స్రవంతి కళాకారులు అసత్యం నాటిక, విజయవాడ అభ్యుదయ ఆర్ట్స్ కళాకారులు ఆంగికం భువనం యస్య నాటిక, హైదరాబాదు మిత్ర క్రియేషన్స్ కళాకారులు ఇది రహదారి కాదు నాటిక, 18న రాత్రి హైదరాబాదు తెల్హాపూర్ మహతి క్రియేషన్స్ కళాకారులు ఉక్కుసంకెళ్లు నాటిక, యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ కళాకారులు నా శత్రువు నాటిక, కర్నాటకలోని బళ్లారి జీఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కళాకారులు చీకటి బ్రతుకులు నాటిక, 19న రాత్రి గుంటూరు జిల్లా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు విడాకులు కావాలి నాటికలు ప్రదర్శిస్తారు. అనంతరం ప్రత్యేక కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. తర్వాత బహుమతి ప్రదానోత్స వం జరుగుతుంది. నాటిక పోటీలకు కళాభిమానులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని భోగాపురం నాటక కళా పరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు కోరారు.

భారీ బండి.. వచ్చేనండి!



చెన్నై నుంచి ఒడిస్సాకు వెళ్తున్న 120 చక్రాలతో కూడిన భారీ వాహనం రాజానగరం హైవేపై బుధవారం కనిపించింది.

- రాజానగరం

క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

● మంత్రి వాసంశెట్టి సుభాష్ ● రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ పోటీలు



బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం రాత్రి రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మంగళవారం రాత్రి బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ కోనసీమ ఆధ్వర్యంలో నిర్వహించే 14వ ఆల్‌ఇండియా, 20వ ఏపీ బాస్కెట్‌బాల్ టోర్నమెంటును మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడాకారులకు విద్య, ఉద్యోగ నియామకాల్లో కోటా పెంపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రామచంద్రపురంలో చాలా ఏళ్లుగా సంక్రాంతికి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీ మాట్లాడుతూ ఖేల్ ఇండియా పథకంలో అమలాపురం పార్లమెంటులో స్టేడియంలు, క్రీడా ప్రాంగణాలు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడారు. క్రీడాకారులను మంత్రి, ఎంపీ పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, లయన్ జి.వీరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా పోటీలు

బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి, బుధవారం లీగ్ స్థాయి పోటీలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్,చండీఘడ్, ఛత్తీస్‌ఘడ్, చెన్నైకు చెందిన మెన్ అండ్ ఉమెన్ జట్లు పాల్గొంటున్నాయి.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పురందరదాసు సంకీర్తనల ప్రాచుర్యానికి కృషి

8,600 మహిళ భక్తిమండల గ్రూపులు

దాససాహిత్య ప్రాజెక్టు ఆఫీసర్ ఆనందతీర్థాచార్యులు

అలమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి భక్తిదాసుడైన పురందరదాసు సంకీర్తనలను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి దాస సాహిత్య ప్రాజెక్టు విశేష కృషి చేస్తుందని దీనిలో భాగంగా 8,600 మహిళభక్తి మండల గ్రూపులు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రాజెక్టు ఆఫీసర్ పి.నందరతీర్థాచార్యులు తెలిపారు. కోనసీమ జిల్లా ఆలమూరు విచ్చేసిన ఆయన స్థానిక విలేకర్లతో మంగళవారం మాట్లాడారు. ఈ గ్రూపుల్లో ప్రస్తుతం 4500 యాక్టివ్‌గా పనిచేస్తున్నాయన్నారు. నూతన గ్రూపుల ఏర్పాటు కోసం ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చామని, ఇందుకోసం వెబ్‌సైట్ నిర్మాణ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. దక్షిత భారతదేశంలో దాస సాహిత్యం ప్రాచుర్యం పొందిందని, పురందరదాసు 4.75లక్షల సంకీర్తనలు రచించారని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 47ఏళ్ల క్రితం టీటీడీ దాససాహిత్య ప్రాజక్టు ఏర్పాటు చేసిందన్నారు. పురందర దాసు కీర్తల సారాంశాన్ని వివరించి మండలి గ్రూపులకు నేర్పిస్తున్నామని వివరించారు. కోలాటం ద్వారా కూడా సంకీర్తనలు ఆలపించేవిధంగా నేర్పిస్తున్నట్టు చెప్పారు. దాససాహిత్య ప్రాజక్టుకు గతేడాది టీటీడీ ద్వారా రూ.2.30కోట్లు బడ్జెటు కేటాయించారని, ఈ సంవత్సరం మార్చిలో బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయన్నారు. బడ్జెట్ పెంచితే దక్షిణ భారతదేశంలో ప్రచారం చేయడానికి వీలు కలుగుతుందన్నారు. గ్రూపులకు పలు ఆధ్యాత్మిక క్షేత్రాలలో వర్క్‌షాపులు నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో ప్రాజక్టు ప్రాచుర్యకర్త పి.ముకుందేశ్వరస్వామి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆనందతీర్థాచార్యులు

ఆకట్టుకున్న వేషధారణలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సంక్రాంతి, కనుమ సంబరాల్లో భాగంగా ఎడ్ల బండ్లపై ప్రదర్శించిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణవేషధారణలు, నరకాసుర సంహారం, దేవతామూర్తుల వేషధారణలతో కళాకారులు అలరించారు. గ్రామమంతా ప్రదర్శన నిర్వహించారు. నరకాసుర సంహారం తదితర అంశాలను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఏటా సంక్రాంతి సందర్భంగా ఇక్కడ బండ్లపై వేషాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాత్రంతా బళ్ల వేషాలు కొనసాగాయి. పూర్వం నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలనే లక్ష్యంతో వీటిని ఏటా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బళ్ల వేషాలను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి అధికంగా ప్రజలు తరలివచ్చారు.





చేబ్రోలులో ఎడ్లబండ్లపై వివిధ దేవతామూర్తుల వేషధారణలలో కళాకారులు

సముద్రంలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన హోంగార్డు



వికాస్ పాండే నుంచి వివరాలు సేకరిస్తున్న మెరైన్ పోలీసులు

సర్పవరం జంక్షన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సరదాగా సముద్ర స్నానం చేస్తోండగా కెరటాల ఉధృతికి కొట్టుకుపోతున్న వ్యక్తిని వాకలపూడి మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హోంగార్డు ప్రాణాలకు తెగించి రక్షించిన సంఘటన సూర్యారావుపేట బీచ్‌లో బుధవారం జరిగింది. వికాస్ పాండే అనే వ్యక్తి జీవనోపాధి కోసం ఉత్తరప్రదేశ్ నుంచి రాజమహేంద్రవరం వచ్చి భవనాలకు ఆల్టెక్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా సరదాగా గడిపేందుకు స్నేహితులతో కలసి బుధవారం మధ్యాహ్నం కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌కు వచ్చాడు. పలు ప్రాంతాలను పరిశీలించిన తర్వాత సముద్రంలో స్నానం చేస్తుండగా కెరటాల ఉధృతికి పాండే కొట్టుకుపోతుండడంతో స్నేహితులు హాహాకారాలు చేశారు. అక్కడే బందోబస్తు విధుల్లో ఉన్న వాకలపూడి మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ రామోహ్మన్‌రెడ్డి ఈ విషయాన్ని గుర్తించి ఎస్ఐ సురేష్, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రాణాలకు తెగించి హోంగార్డు కె.గంగాధర్ (హెచ్‌జీ 408) సముద్రంలోకి వెళ్లి పాండేను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చాడు. సముద్రం నీరు మింగేసిన పాండేకి మెరైన్ పోలీసులు సపర్యలు చేసి కోలుకునేలా చేశారు. ప్రాణాలకు తెగించి వికాస్ పాండేని కాపాడిన హోంగార్డు గంగాధర్‌కు బహుమతి ఇచ్చి మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. బందోబస్తు విధుల్లో ఉన్న మెరైన్ పోలీసులను అభినందించారు.



హోంగార్డు గంగాధర్‌కి బహుమతి ఇచ్చి సత్కరిస్తున్న మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి

'పాదగయ'లో సినీ నటుడు ఆది పూజలు



సినీనటుడు ఆదికి స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

పిఠాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని బుధవారం ప్రముఖ సినీనటుడు ఆది సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పుర్హుతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆదిని ఆలయ మర్యాదలతో ఈవో జగన్మోహన శ్రీనివాస్ సత్కరించి శేషవస్త్రాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

కోరుకొండ లక్ష్మీనరసింహస్వామికి బంగారు కిరీటం



ఆలయంలో కిరీటం అందజేస్తున్న దాతలు

కోరుకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలో శ్రీలక్ష్మీనరసింహస్వామికి రూ.16 లక్షలు విలువ గల బంగారు కిరీటాన్ని బహూకరించారు. ఈ మేరకు స్వామివారి ఆలయ ముఖ మండపం నందు బంగారు కిరీటాన్ని ఉంచి ప్రత్యేకపూజలు, అర్చనలు నిర్వహించారు. సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన వీణపల్లి శ్రీనివాస్, ఉషారాణి దంపతులు ఈ బంగారు కిరీటాన్ని అందజేశారు. గతంలో లక్ష్మీదేవికి బంగారు కిరీటం ఉండేదని అయితే లక్ష్మీనరసింహస్వామికి బంగారు కిరీటం అందజేయాలని సంకల్పించుకున్నామన్నారు. దీని ప్రకారం బంగారు కిరీటాన్ని ఆలయంలో పూజ అనంతరం అర్చక స్వాములకు అందజేసినట్టు ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో అనువంశిక అర్చక స్వాములు పెద్దింటి సత్తిబాబు, పెదపాటి గిరిధరా చార్యులు, వాడపల్లి నాగు ఆచార్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మధ్వ సమాఖ్య ఆధ్వర్యంలో...

19న రాజమహేంద్రిలో వివాహ పరిచయ వేదిక

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మధ్వ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 19న తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నారు. గోదావరి గట్టున గల మల్లిగ సత్రంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ వివాహ పరిచయ వేదికకు ప్రముఖ ఆడిటర్ అంగర లక్ష్మీ నరసింహారావు అధ్యక్షత వహిస్తారు. కానుగోని వాసుదేవాచార్యులు వధూవరుల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మధ్వ వధూ వరులు తమ తల్లిదండ్రులతో రావాలని మధ్వ సమాఖ్య బుధవారం ఒక ప్రకటనలో కోరింది.

జనాల్లోకి దూసుకొచ్చిన రెండెడ్ల బండి

అంబాజీపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు నుంచి జగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి రెండెడ్ల బండి వస్తుండగా జనాలు బూరలు ఊదడంతో ఎడ్లు భయపడి జనాల్లోకి వచ్చాయి. దీంతో తీర్థానికి వచ్చిన నలుగురు భక్తులకు గాయాలైనట్లు తెలిసింది. ఎద్దులను కట్టడి చేసి తిరిగి తీర్థంలోకి తీసుకువెళ్లారు.

రమణబాబును కలిసిన తేజస్వి

అమలాపురంటౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి బుధవారం టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఐటీ వింగ్ ప్రతినిధి మంతెన సీతారామరాజు, కడలి ప్రసాద్, భాస్కర్ల రవితేజ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నల్లా స్వామి పాల్గొన్నారు.

జోరుగా కోడిపందాలు, గుండాట





ముమ్మిడివరం: రాజుపాలెంలో గుండాట, మామిడికుదురు: మగటపల్లిలో రికార్డింగు డ్యాన్స్, అమలాపురం: కామనగరువులో కోడి పందాల విజేత యడ్లపల్లి సురేష్‌చౌదరికి ఎన్‌ఫీల్డ్ అందిస్తున్న దృశ్యం

- యథేచ్ఛగా పండగ మూడు రోజులు గుండాట, కోడిపందాలు
- ప్రకటనలకు పరిమితమైన పోలీసులు

ముమ్మిడివరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడిపందాలు, గుండాట, పేకాటలు యథేచ్ఛగా నిర్వహించారు. మూడురోజులు ఒక్కొక్క బరిలో రూ.30 లక్షల నుంచి రూ.40లక్షల వరకు పందాలు జరిగినట్టు అంచనా. ముమ్మిడివరం నగరపంచాయతీ రాజుపాలెం, ముమ్మిడివరం మండలంలో గేదెల్లంక, అన్నంపల్లి, కొత్తలంక గ్రామాల్లో కోడి పందాలు, గుండాటలు యథేచ్ఛగా సాగాయి. రాజుపాలెంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో, గేదెల్లంకలో జనసేన పార్టీ నాయకులు, అన్నంపల్లిలో వైసీపీ, టీడీపీ నాయకులు, కొత్తలంకలో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో కోడిపందాలు, గుండాటలు జోరుగా సాగాయి. రాజుపాలెంలో జరిగిన కోడిపందాలను ఎమ్మెల్యే బుచ్చిబాబు, టీడీపీ నాయకులు వీక్షించారు. కోడిపందాల బరుల వద్ద ఫ్లడ్ లైట్లను ఏర్పాటుచేసి రాత్రి, పగలు తేడా లేకుండా కోడిపందాలు, గుండాటలు నిర్వహించారు. గుండాటలను రూ.100, రూ.500 బోర్డులను నిర్వహించారు. బరుల వద్ద పందెం రాయుళ్ల, సందర్శకులకు మాంసం పకోడి, బిర్యానీ వంటి స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. సందర్శకులు వీటిని కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. పండుగ మూడు రోజులు ముమ్మిడివరంలో నాలుగు బరుల వద్ద సుమారు రూ.కోటిన్నర మేర పందేలు జరిగినట్టు అంచనా.

కోసల కోసం ఎగబడ్డ మాంసంప్రియులు..

సంక్రాంతి పండుగ మూడు రోజులు గ్రామాల్లో జరిగిన కోడిపందాలబరుల వద్ద కోస (పందెంలో మృతిచెందిన కోడిపుంజు) కోసం మాంసం ప్రియులు ఎగబడ్డారు. ఒక్కొక్క కోశ ధర రూ.2వేల నుంచి రూ.4వేలకు వరకు పలికింది.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నేపథ్యంలో ఏర్పాటు చేసిన కోడిపందాలు, గుండాటలు మూడురోజులు యథేచ్ఛగా సాగాయి. పోతవరం ప్రధానరహదారి చెంతన, పోతవరం వాటర్‌ట్యాంక్ కాలనీ, పి.గన్నవరం శివారు డీఎస్‌పాలెం, ఉడిమూడి, నాగుల్లంక, మొండెపులంక, వాడ్రేవుపల్లి, మానేపల్లి గ్రామాల్లో కోడి పందాలు, గుండాటలు జోరుగా సాగా యి. డీఎస్‌పాలెం, ఉడిమూడి బరుల్లో పేకాట నిర్వహించారు. కోడిపందెల బరులు వద్ద షామియానాలు ఏర్పాటుచేసి బిరియాని సెంటర్లు, కోడి మాంసం దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఆప్రాంతాలు తిరునాళ్లను తలపించాయి.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులు గుండాటలు, రికార్డింగు డ్యాన్సులు, కోడి పందాలు హోరెత్తాయి. డ్యాన్సులు ఆదుర్రు, గోగన్నమఠం, మగటపల్లి, కొమరాడ, పాశర్లపూడి తదితర గ్రామాల్లో తదితర గ్రామాల్లో అడ్డూ అదుపు లేకుండా జరిగాయి. ఆయా చోట్ల గుండాటల, కోడిపందాలు విచ్చలవిడిగా సాగాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన కోడిపందాల బరుల వద్ద మద్యం ఏరులై పారింది. రికార్డింగు డ్యాన్సులు ప్రదర్శిస్తున్న స్టేజ్‌ల వద్ద యువకులు ఆనందోత్సాహాల మధ్య కేరింతలు కొడుతూ ఆడి పాడారు. మగటపల్లిలో అయితే అశ్లీల నృత్యాలు అడ్డుకున్న పోలీసులను సైతం నిర్వాహకులు తోసుకుంటూ వెళ్లిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. సంక్రాంతి బరిలో పందెం కోడి, గుండాట, పేకాటలు, రికార్డింగు డ్యాన్సులు అధికారుల ప్రకటనలు లెక్కచేయకుండా నిర్వహించారు.



అమలాపురం: కామనగరువులో కోడిపందాలు తిలకిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పలు గ్రామాల్లో కోడిపందాలు, గుండాటలు యథేచ్ఛగా జరిగాయి. కేశనపల్లి, తూర్పుపాలెం, పడమటిపాలెం గ్రామాల్లో కొన్ని గంటల పాటు రికార్డింగు డ్యాన్సులు జరిగాయి. గ్రామాల్లో రికార్డింగు డ్యాన్సులవద్ద భారీగా జనం గుమిగూడారు. కేశనపల్లి, తూర్పుపాలెం గ్రామాల్లో రికార్డింగు డ్యాన్సులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. తూర్పుపాలెంలో నీలపళ్లమ్మ 63వ వార్షికోత్సవం సందర్భంగా ఉత్సవాలు భారీగా జరిగాయి. కేశనపల్లి, తూర్పుపాలెం నుంచి ప్రభలు ఊరేగింపుగా నీలపళ్లమ్మ ఆలయం వద్దకు చేరాయి. ప్రభలను ఒకరికంటే ఒకరు పోటీపడి అందంగా అలంకరించారు. గుండాటలు, కోడిపందాలు వాడవాడలా జరిగినా పోలీసులు చర్యలు నామమాత్రం. 3రోజులు మండల పరిధిలోని పలు గ్రామాల్లో కోడిపందాలు, గుండాటలు నిరాటంకంగా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగాయి.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, గుండాటలు, పేకాటలను బుధవారం విచ్చలవిడిగా నిర్వహించారు. కోడిపందాలను చూసేందుకు మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఎగబడ్డారు. దీంతో మండలంలో ఉన్న ఆయా గ్రామాల రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. తాటిపాక, రాజోలు, శివకోడు, వేగివారిపాలెం, మెరకపాలెం, చింతలపల్లి, సోంపల్లి, బిసావరం తదితర గ్రామాల్లో జోరుగా గుండాటలు, కోడిపందాలు నిర్వహించారు. తాటిపాకలో కంచి కామాక్షి అమ్మవారి ఆలయం వద్ద ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించారు. తాటిపాక, గెద్దాడ, మొగలికుదురు తదితర గ్రామాల నుంచి అమ్మవారి ఆలయానికి ప్రభలతో ఊరేగింపుగా తరలివచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రభల తీర్థం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో తొలిరోజు ఆలస్యంగా ప్రారంభమైన కోడిపందాలు మిగిలిన మూడు రోజులు జోరుగా సాగాయి. సఖినేటిపల్లి, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, అంతర్వేదిదేవస్థానం, కేశవదాసుపాలెం, మోరి, మోరిపోడు తదితర గ్రామాల్లో ప్రత్యేక బరులు వేసి కోడిపందాలు, గుండాటలు నిర్వహించారు. ఉభయ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోడిపందాలు, గుండాటలు, రాజోలు నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన రికార్డింగు డ్యాన్సులను తిలకించారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడి పందాల శిబిరాలు మొదటి రోజున కొనసాగినప్పటికీ రెండో రోజు నుంచి కొన్ని గ్రామాల్లో మూతపడ్డాయి. ఏడు ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేయగా ఎన్.కొత్తపల్లి, చల్లపల్లి, ఎస్.యానాం బీచ్‌ల్లో అంతంత మాత్రంగా పందాలు కొనసాగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో పందాలపై జనం ఆసక్తి చూపకపోవడంతో మూసి వేశారు. గుండాటలకు సైతం అంతగా ఆసక్తి చూపకపోవడంతో నిర్వాహకులు డీలా పడ్డారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కోడి పందాలు మూడు రోజుల పాటు నిర్వహించారు. గుండాటలు కొనసాగాయి. గెద్దనపల్లి, చెయ్యేరు, పల్లం, పల్లంకుర్రు, మొక్కలతిప్ప, బలుసుతిప్ప, కాట్రేనికోన, వేట్లపాలెం, లైట్ హౌస్ ప్రాంతాల్లో కోడి పందాలు నిర్వహించారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): అల్లవరం సడక్ రోడ్డు, కోడూరుపాడు, ఆకులవారిపేట, గుడ్డివానిచింత, గుత్తులవారిపాలెం, దేవగుప్తం, రెల్లుగడ్డ, తూర్పులంక గ్రామాల్లో కోడి పందాలు నిర్వహించారు. కోడిపందాల బరుల వద్ద మద్యం అమ్మకాలు, మాంసం అమ్మకాలు నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రముఖ పట్టణాల నుంచి కూడా సొంతూళ్లకు వచ్చి కోడిపందాలు తిలకించారు. పలుచోట్ల మహిళలు సైతం గుండాటల్లో పాల్గొన్నారు. పోలీసుల హెచ్చరికలు, కోర్టు ఆదేశాలున్నా తగ్గేదేలే అంటూ పందాలు నిర్వహించారు. పందెం మూడు రోజుల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. ఒక్కో పందెం బరి వద్ద గుండాట నిర్వహణకు రూ.6లక్షల నుంచి రూ.9లక్షల వరకు పాటలు జరిగాయి. పందాల్లో ఓడిన కోడిపుంజు కోసల మాంసానికి మంచి డిమాండ్ వచ్చింది. గుండాటలు, కోడిపందాల నిర్వహణలో బరుల్లో స్వల్ప ఘర్షణలు తలెత్తాయి.

అమలాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లో కోడిపందాలు, గుండాటల జోరు బుధవారం రాత్రితో ముగిసింది. పందెపు బరులు నిర్వహించిన వారిపై నాలుగు కేసులు నమోదు చేసినట్టు తాలూకా ఎస్‌ఐ వైశేఖర్‌బాబు తెలిపారు. కామనగరువులో నిర్వహించిన కోడిపందాలను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, డిస్ట్రిబ్యూటరీ ప్రాజెక్టు కమిటీ డైరెక్టర్ రాజులపూడి వెంకటేశ్వరరావు(భీముడు) తిలకించారు. పందెం బరి వద్ద విజేతకు బుల్లెట్‌ను బహూకరించారు. అయినవిల్లి మండలం మాగాం గ్రామానికి చెందిన సురేష్‌చౌదరికి బుల్లెట్‌ను బహూకరించారు. రోళ్లపాలెం, ఇందుపల్లిగరువు బరుల వద్ద పందాలు, గుండాటలు హోరెత్తాయి. గతంలో ఎన్నడూలేని విధంగా అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఎదురుగా పందెపు రాయుళ్ల రికార్డింగు డ్యాన్సులు నిర్వహించడం చర్చనీయాంశమైంది. ఎక్కడికక్కడ గుండాట నిర్వహించిన ఆ వైపు పోలీసులు కన్నెత్తి చూడలేదు.

కన్నుల పండువగా ప్రభల తీర్థం





అయినవిల్లిలో ప్రభల ఊరేగింపు, ముమ్మిడివరం: రాజుపాలెంలో ప్రభల తీర్థం, మామిడికుదురు శివారు కొర్లగుంటలో కొలువుతీరిన ప్రభలు

- గ్రామాల్లో ప్రభల ఊరేగింపు
- కాల్వలు, పొలాలు దాటించిన ప్రభలు
- పూలతో ప్రభల అలంకరణ

ముమ్మిడివరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ చివరిరోజు కనుమ రోజైన బుధవారం ప్రభల తీర్థాన్ని ఉత్సాహంగా ఉల్లాసంగా భక్తి భావం ఉప్పొంగేలా ప్రాచీన సంస్కృతి సంప్రదాయాల మేళవింపుతో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో దేవతా మూర్తులను ప్రభలపై ఉంచి భక్తి భావం చాటుకున్నారు. యువకులు అచ్చెరభచెరభ.. అల్లాలవీరా అంటూ రంగురంగుల పువ్వులతోను దస్తులతోను అలంకరించిన ప్రభలను సన్నాయిమేళాలు, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో తీర్థ ప్రదేశాలకు తీసుకువచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలో పెద్ద ప్రభల తీర్థం జరిగింది. ప్రభల తీర్థం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొమానపల్లి, కొత్తలంక, ముమ్మిడివరం గ్రామాల తల్లి ప్రభలను ఆయా గ్రామాల నుంచి సన్నాయి మేళాలు, బాణసంచా కాల్పులతో యువకులు కేరింతల నడుమ ఊరేగింపుగా పల్లిపాలెం తీర్థ స్థలావరణకు తీసుకువచ్చారు. ముమ్మిడివరం అగ్రహారం, చింతలమెరక, వడ్డిగూడెం, పదో మైలురాయి, రాజుపాలెం గ్రామాల ఉత్సవ ప్రభలను పచ్చని పంటపొలాలు, మురుగునీటి డ్రెయిన్లు, పంటకాల్వలను దాటుకుంటూ తీర్థ ప్రదేశానికి తీసుకువచ్చారు. ఆయా గ్రామాల శివస్వరూపమైన ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రభలను పూలదండలు, దుస్తులతో అలంకరించారు. ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా తీర్థస్థలికి తొలుత వచ్చిన ప్రభ మిగిలిన ప్రభలకు స్వాగతం పలుకుతూ ప్రభలు వచ్చిన వెంటనే ప్రభను నిర్దిష్ట ప్రదేశం నుంచి పైకి లేపి అన్ని ప్రభలకు స్వాగతం పలుకుతారు. తొమ్మిది గ్రామాలకు చెందిన మొత్తం పదహారు ప్రభలను తీర్థస్థలిలో ఉంచారు. అధిక సంఖ్యలో భక్తుల తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రొయ్యలచెరువులు, మురుగుకాల్వల నుంచి తరలివచ్చిన ప్రభలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పెన్మెత్స జగ్గప్పరాజు, పెన్మెత్స చిట్టిరాజుతో పాటు పలువురు తీర్థ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్‌ల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. అలాగే అన్నంపల్లి, క్రాపచింతలపూడి, అయినాపురం గ్రామాల్లో ప్రభల తీర్థం జరిగింది. ప్రభల తీర్థాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభల తీర్థం వైభవంగా నిర్వహించారు. కనుమ పండుగ సందర్భంగా ప్రభలను సుందరంగా పుష్పాలతో అలంకరించారు. శివనామస్మరణతో ఊరేగింపుగా ముక్తేశ్వరంలోని ముక్తికాంత క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయంలో వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం నుంచి ప్రభలను ముందుగా ఊరేగింపుగా తీసుకువచ్చారు. మడుపల్లి, చింతనలంక, తొత్తరమూడి, విలస, సిరిపల్లి, భట్నవిల్లి ప్రభలు ముక్తేశ్వరంలోని క్షణముక్తేశ్వరస్వామి ఆలయం వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. వీరవల్లిపాలెం, శానపల్లిలంక ప్రభలను ఆయాగ్రామాల్లోనే ఉత్సవం నిర్వహించారు.

అయినవిల్లి శ్రీసిద్ధివినాయక దేవస్థానం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గులు, హరిదాసులు, గంగిరెద్దులు, సాంస్కృతిక ప్రదర్శనలు, కేరళ వాయిద్యాలతో ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. అయినవిల్లి సిద్ధివినాయక ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో రహదారులు, ఆలయ మండపాలు భక్తులతో కిక్కిరిశాయి. విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలుగకుండా సేవలందించారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): కోనసీమ వాసులు ఈశ్వరుని ప్రతిరూపంగా భావించే ప్రభలు పచ్చని పంటపొలాలు, పంటకాలువలను దాటుకుని ఒకచోట కొలువు తీరి భక్తులకు దర్శనమిచ్చాయి. కనుమ సందర్భంగా మండల పరిధిలోని పలుచోట్ల ప్రభల ఉత్స వాలు వైభవంగా జరిగాయి. యువత కేరింతలు, బ్యాండు మేళాలు, బాణసంచా కాల్పులు మధ్య ప్రభలను ఆయా గ్రామాల పురవీధుల్లో ఊరేగించారు. అంబాజీపేట మండలం చిరతపూడి, కొత్తపేట మండలం అవిడి, మోడేకుర్రు, పి.గన్నవరం మండలం నరేంద్రపురం, కుందాలపల్లి గ్రామాలకు చెందిన 40ప్రభలు ప్రత్యేక పూజలు అనంతరం ఆయా గ్రామాలు నుంచి ఊరేగింపుగా 2కిలోమీటర్లు మేర పంటపొలాలు, పంటకాలువలు దాటుకుని కుందాలపల్లి డ్యామ్ సెంటర్‌కు చేరుకుని కొలువుతీరాయి. అలాగే భక్తుల దర్శనం తరువాత ఆయా గ్రామాలకు ప్రభలు ఊరేగింపుగా తిరిగి పయనమయ్యాయి. అదేవిధంగా ముంగండపాలెం శివారు గాజులగుంట ప్రభల దిబ్బ వద్ద ఊలిశెట్టివారిపాలెం, కారుపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రభలు కొలువుతీరాయి. అలాగే నాగుల్లంక, మానేపల్లి, ముంగండ గ్రామాల్లో ప్రభల తీర్థమహోత్సవాలు ఘనంగా జరిగాయి. నాగుల్లంకలో వివిధ దేవుళ్ల చిత్రాలతో ఏర్పాటుచేసిన ప్రభలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వారాహి అమ్మవారి ప్రభను అందంగా తీర్చిదిద్దారు. కుందాలపల్లిలో కొలువు తీరిన ప్రభల్లో పలు ప్రభలు వెనుక భాగంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి చిత్రాలతో ఏర్పాటుచేసిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): కనుమ రోజున మామిడికుదురు శివారు కొర్లగుంటలో నిర్వహించే ప్రభల తీర్థం అంగరంగ వైభవంగా బుధవారం జరిగింది. పెదపట్నం నుంచి తొమ్మిది ప్రభలను పీకల్లోతు నీటిలో ప్రధాన పంటకాల్వ నుంచి తీర్థస్థలికి తీసుకువచ్చిన దృశ్యాలు భక్తులను గగుర్పాటుకు గురిచేశాయి. హరహరా అంటూ ప్రభలను భుజాలపై ఎత్తుకుని తీర్థస్థలికి తీసుకువచ్చిన దృశ్యాలు భక్తుల మనసును రంజింపచేశాయి. మామిడికుదురు, ఈదరాడ, పాశర్లపూడి, నగరం తదితర గ్రామాల నుంచి ప్రభలను భక్తులు భజాభజంత్రీలు, బాణసంచా కాల్పులు, తీన్‌మార్ డప్పుల మధ్య ఊరేగింపుగా తీర్థస్థలికి తీసుకువచ్చారు. కొర్లగుంటలో కొలువైన 13 ప్రభలను భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు. కొర్లగుంటలో జరిగే తీర్థంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆనందోత్సాహాలతో గడిపారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): ప్రభల ఊరేగింపులు బుధవారం గ్రామగ్రామాన వైభవంగా జరిగాయి. గొల్లవిల్లి, వాడపర్రు, సన్నవిల్లి, ఉప్పలగుప్తం, విలసవిల్లి, భీమనపల్లి, ఎన్.కొత్తపల్లి, చినగాడవిల్లి, చల్లపల్లి, కూనవరం తదితర గ్రామాల్లో ఉదయం ప్రభల పూజలు, రాత్రి ఊరేగింపులు నిర్వహించారు. యువత ఆధ్వర్యంలో బాణసంచా కాల్పులు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కనుమ రోజున తుమ్మలపల్లి పంచాయతీ లక్ష్మణేశ్వరంలో ప్రభల తీర్థం ఘనంగా జరిగింది. మొగళ్లమూరి, కొమరగిరిపట్నం, బెండమూర్లంక గ్రామాల నుంచి ఉత్సవ ప్రభలను బాణసంచా కాల్పులు, బ్యాండు మేళతాళాలతో లక్ష్మణేశ్వరం తీసుకువచ్చారు. లక్ష్మణేశ్వరం పార్వతీ రామేశ్వరాలయం వద్ద కొలువుదీరిన ఉత్సవ ప్రభలకు భక్తులు పూజలు చేశారు. ప్రభల తీర్థానికి భక్తులు పోటెత్తారు.

అమలాపురం టౌన్, (ఆంధ్రజ్యోతి): అమలాపురం వంటెద్దువారి వీధిలో సంక్రాంతిని పురస్కరించుకుని ప్రభల తీర్థం వైభవంగా నిర్వహించారు. శ్రీగణపతి, శ్రీగనికమ్మ అమ్మవారి ప్రభల తీర్థ మహోత్సవానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. శ్రీగనికమ్మ ఆలయంలో నిర్వహించిన కుంకుమ పూజ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రభల తీర్థాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రభలను ఊరేగింపుగా వంటెద్దు వారి వీధికి తీసుకువచ్చారు. ఊరేగింపులో ఈదరపల్లి ప్రభలు, శ్రీశేషశయన, శ్రీగనికమ్మ, శ్రీకనకదుర్గ, శ్రీమెట్లకాలనీ ప్రభలు పాల్గొన్నాయి. అదే విధంగా మెయిన్‌రోడ్డులోని శ్రీకృష్ణేశ్వర దేవస్థానం వద్ద ప్రభల తీర్థం నిర్వహించారు. పాలగుమ్మి, నడిపూడి, సాకుర్రు గున్నేపల్లి అగ్రహారం గ్రామాల్లో ప్రభల ఉత్సవాలు జరిగాయి.

నేలకొరిగిన కోళ్లు..చేతులు మారిన కోట్లు

ఐ.పోలవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముసుగులో పందెంరాయుళ్ళు రెచ్చిపోయారు. పోలీస్, రెవెన్యూ హెచ్చరికలు గాలిలో కలిసిపోయాయి. మురమళ్లలో మూడురోజుల జరిగిన కోడి పందాలు, గుండాటలు తిరునాళ్ళను తలపించాయి. మురమళ్ల బరిలో రూ.50కోట్లు చేతులు మారినట్టు సమాచారం. కోడి పందాలను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, అమలాపురం, కాకినాడ ఎంపీలు గంటి హరీష్‌మాధుర్, తంగెళ్ళ ఉదయశ్రీనివాస్, సినీ నటి హేమ తిలకించారు.


అలరించిన సంక్రాంతి సంబరాలు



అమలాపురంలో మెట్రోకెమ్ అధినేత నందెపు బాలాజీ ఇంటి వద్ద సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రభల ఉత్సవం

అమలాపురంటౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు(బాలాజీ)-విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అమలాపురం పట్టణ పరిసర గ్రామాల ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నందెపు ఎన్ క్లేవ్ వద్ద బుధవారం కనుమ రోజున నిర్వహించిన ప్రభల ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. మహిళలకు, యువతులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆర్డీవో కె.మాధవి, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు బహుమతులు అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, నల్లా స్వామి, గంధం పల్లంరాజు, ఆశెట్టి ఆదిబాబు, అడపా వెంకటేశ్వరరావు(బాబ్జి), బాలాజీ కుటుంబ సభ్యులైన మెట్రోకెమ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎన్.హర్షవర్ధన్, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ ఎన్.హరదేవ్, డిజిటల్ మార్కెటింగ్ హెడ్ యజ్ఞసరోజ పాల్గొన్నారు.

అల్లు అరవింద్‌ను కలిసిన దేవ



మలికిపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ సంక్రాంతి సందర్భంగా దిండి రిసార్ట్స్‌కు వచ్చారు. ఆయన్ను రాజోలు ఏరియా సీపీఐ నాయకులు దేవ రాజేంద్రప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు.

డెల్టా చైర్మన్ గుబ్బలకు పూర్వ విద్యార్థుల సన్మానం

రాజోలు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పొన్నమండ జిల్లాప్రజాపరిషత్ ఆవరణలో అదే పాఠశాలలో విద్యనభ్యసించిన 1990-91 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం గోదావరి సెంట్రల్ డెల్టాప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్‌కు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల మాట్లాడుతూ తన తోటి పూర్వ విద్యార్థులు తనకు సన్మానం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెల్లాకుల నాగేంద్ర, కె.హరిబాబు, పి.శ్రీనివాస్, కె.ప్రసాద్, సూర్యం, ఉష, భారతి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలతో ఊరేగింపు

అల్లవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కనుమ పండుగ రోజున వాహనాలకు పూజలు చేసి ఊరేగింపులు జరిపారు. మోటారు సైకిళ్లు, ఎడ్ల బండ్లు, కార్లు, గుర్రపు బండ్లకు పూజలు చేసి ఊరేగారు. యెంట్రుకోనలో మాజీ సర్పంచ్ పోలేటి దొరయ్యనాయుడు, టీడీపీ నేత వేగిరాజు వెంకట్రాజు ప్రత్యేకంగా అలంకరించిన గుర్రపు బండిపై ఊరేగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అల్లవరం, కొమరగిరిపట్నం, యెంట్రుకోన, కోడూరుపాడు తదితర గ్రామాల్లో వాహనాల ఊరేగింపులు జరిగాయి.

'జగ్గన్నతోట'ను రాష్ట్ర పండుగగా గుర్తించేలా కృషిచేస్తా

ఏకాదశ రుద్రులను దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే



జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని తిలకిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తేజస్వి

అంబాజీపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): 450ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేలా కృషి చేస్తానని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. మొసలపల్లి పరిధిలో జగ్గన్నతోటలో జరిగిన ఏకాదశ రుద్రుల ఉత్సవంలో ప్రముఖులు ఏకాదశ రుద్రలను దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కూటమి నేతలు స్వామివార్లను దర్శించుకున్నారు. గంగలకుర్రు వద్ద గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామివారి ప్రభను ఎంపీ హరీష్‌మాధుర్ దర్శించుకున్నారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ జాతీయ గుర్తింపు పొందిన ఏకాదశ రుద్రుల ఆశీస్సులు అందరిపై ఉండాలన్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ, ఢిల్లీ రిపబ్లిక్ పేరేడ్‌లో ఏకాదశ రుద్రల ప్రభల ఉత్సవం థీమ్‌ను ప్రదర్శించడం, తాజాగా కేంద్ర పర్యాటక శాఖ వైబ్ సైట్‌లో ఏకాదశ రుద్రుల ఉత్సవం చోటు కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం తీర్థంలో కొలువైన ప్రభలను ఆయన దర్శించుకున్నారు.

కోసలకు పెరిగిన డిమాండ్

కాట్రేనికోన, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కోడి పందాల బరుల్లో కోసల కోసం మాంసం ప్రియులు ఎగబడుతున్నారు. ఒక్కొక్క కోసం రూ.2,000 నుంచి రూ.5,000 వరకు పలుకుతోంది. పండుగకు ఇంటికి వచ్చిన చుట్టాలకు కోస మాంసంతో భోజనం పెట్టాలన్న ఆసక్తితో ఎక్కువ మంది కోసలకు ఎగబడుతున్నారు. కొందరు ఉద్యోగుల తమ పైఅధికారులకు కోస మాంసం పంపేదుకు ప్రయత్నించడంతో కోసకు మరింతగా విలువ పెరిగింది. అయితే ఈఏడాది పందాలు అంతంత మాత్రంగానే జరగడంతో కోసలు లభించక మాంసాహారులకు నిరాశ మిగిలింది.

తరతరాల సంప్రదాయం.. శూలధారుల ఊరేగింపు



అలుగులు ధరించి ట్రాక్టర్‌పై ఊరేగుతున్న యువకులు

అమలాపురం రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడి గ్రామానికి చెందిన కరికాల భక్తులు బుధవారం కనుమ రోజున వీరభద్రుని సంబరం అత్యంత వైభవంగా నిర్వహించారు. కంఠంపైన, బుగ్గలపైన అలుగులు (శూలాలు, కత్తులు) గుచ్చినప్పుడు జివ్వున రక్తం ఎగజిమ్ముతుంటే ఎవరికైనా ఒళ్లు గగుర్పొడుస్తోంది. రక్తం కారుతున్నా వారు పట్టించుకోరు. ఉదయం స్థానిక వీరభద్రుని ఆలయం వద్ద నుంచి అలుగులు ధరించిన యువకులను, చిన్నారులను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామమంతా ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోని అన్ని వీధుల్లో సంబరం నిర్వహించారు. రక్తం కారుతూ వస్త్రాలు తడిచి ముద్దవుతున్నా యువకులే కాదు, చిన్నారులు కూడా చలించరు. ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తిలకించి ఆలయంలో పూజలు నిర్వహించారు.

జాతీయ స్థాయి పోటీలకు యానాం క్రీడాకారులు

యానాం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లాలో ఈనెల 17నుంచి 21వరకు జరిగే భారత బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 69వ బాల బాలికల జూనియర్ జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు యానాం క్రీడాకారులు ఎంపికయ్యారని యానాం క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శశేషసుమాన్ తెలిపారు. బాలుర విభాగం నుంచి చోడే గుణశ్యామ్ ప్రతాప్, రుద్రరాజు షణ్ముఖ వెంకట వర్మరాజు, సబ్బతి విష్ణుశ్రీవర్ధన్, పాలెపు యోమంత్ గంగాధర్ భరత్, బాలికల విభాగంనుండి పోలిశెట్టి హర్షిని దేవి, కుసుమ షర్మిల ఎంపికయ్యారు. విద్యార్థులను, వారి తల్లితండ్రులను క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శశేషసుమాన్, కోచ్ బొట్టా శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారుడు రాయపురెడ్డి విజయ్ అభినందించారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంతర్వేది, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని ఉభయ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల ప్రజలు అంతర్వేది పుణ్యక్షేత్రానికి విచ్చేశారు. తొలుత క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు అనంతరం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. భక్తుల రద్దీ మేరకు ఆలయ సిబ్బంది, అధికారులు ప్రత్యేక సేవలు అందించి స్వామి దర్శనానికి తూర్పుద్వారం ద్వారా నిత్యాన్నదానంలోకి వెళ్లారు. స్వామివారి ప్రసాదం తీసుకున్న భక్తులు పుణ్యక్షేత్రం, ఉప ఆలయాలను దర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు, పర్యాటకులు, సందర్శకులు లైట్ హౌస్, బీచ్‌ల్లో సందడి చేశారు.

సంప్రదాయాలకు నెలవు సంక్రాంతి పండుగ

పి.గన్నవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంప్రదాయాలకు నెలవు సంక్రాంతి పండుగని ఇటీవల డీఐజీగా పదోన్నతి పొందిన ఐపీఎస్ అధికారి భూసారపు సత్యఏసుబాబు అన్నారు. సంక్రాంతి సందర్భంగా నరేంద్రపురం స్వగృహానికి విచ్చేసిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నేటి యువతకు సంప్రదాయాలతో కూడిన చారిత్రాత్మక పండుగలు గురించి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల్లో ఉంటూ నిత్యం బిజీగా గడిపే వారు స్వంత గ్రామాల్లో సంక్రాంతి పండుగను జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో ప్రభ వద్ద పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.

ఆలయంలో సెంట్రల్ డీజీ పూజలు

అంతర్వేది, జనవరి 15(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సెంట్రల్ డీజీ ఆజాద్‌చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

50ఏళ్ల నాటి అపూర్వ కలయిక



మలికిపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మోరి శ్రీమతి జానసుబ్బమ్మ మెమోరియల్ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 1975లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు స్కూల్ ఆవరణలో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. 50 సంవత్సరాల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్వర్ణోత్సవ వేడుకలకు సూచికగా ప్రతీ స్నేహితునికి జ్ఞాపికలు అందించారు. తొలుత కార్యక్రమానికి కడి వెంకటసత్యనారాయణ స్వాగతం పలకగా కొండా సత్తిబాబు అధ్యక్షత వహించారు. 1975లో జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన సీహెచ్ సాంబశివరావును పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. డాక్టర్ గోపరాజు నారాయణరావు, జీవీ చలపతిరావు, వలవల సూర్యనారాయణ, కుంపట్ల సాయిబాబు, కొండా సూర్యకాంతంపాల్గొన్నారు.

270 రకాల పిండి వంటలతో విందు



మామిడికుదురు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామానికి చెందిన కుక్కల వెంకటేశ్వర్లు కుమార్తె మౌనికకు మూడు నెలల క్రితం వివాహమైంది. సంక్రాంతి సందర్భంగా అత్తవారింటికి అల్లుడు బత్తుల శ్రీరామ్‌కు 270పిండి వంటలతో మెగా విందు ఏర్పాటుచేసి ఔరా అనిపించారు.

మకరజ్యోతి దర్శనంతో పులకించిన భక్త జనం

ఆలమూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతి సందర్భంగా ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయం వద్ద మంగళవారం మకరజ్యోతి దర్శనంతో భక్తజనం పులకించారు. ముందుగా గ్రామంలో అయ్యప్ప స్వామి ఆభరణాలతో చిన్నారులతో జ్యోతుల ఊరేగింపు నిర్వహించి అనంతరం సాయంత్రం 6.45 గంటలకు మకరజ్యోతి దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయం పక్కనే ఉన్న చెరువులో స్వామి వారికి తెప్పోత్సవం జరి పారు. బాణ సంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు అధికారి పి.ఆనందతీర్థాచార్యులు, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.ముకుందేశ్వరస్వామి, కమిటీ చైర్మన్ వంటిపల్లి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడి ఆలయంలో పోటెత్తిన అయ్యప్ప భక్తులు


ద్వారపూడిలో అయ్యప్పస్వామి

మండపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) మండపేట మండలం ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకర జ్యోతి దర్శనంతో భక్తులు పులకించారు. ఆలయ ట్రస్టీ ఎస్ఎల్ కనకరాజు గురుస్వామి సారధ్యంలో దీన్ని జరిపారు. తొలుత స్వామివారికి సంబంధించిన నగల పెట్టెను గోదావరి ఫణి భూషన్‌స్వామి శిరస్సున ధరించి గురుస్వామి స్వగృహం నుంచి స్వామివారి ఆలయానికి నగల పెట్టెతో ఉరేగింపు జరిపారు. ఉదయం గణపతిహోమం, స్వాముల ఇరుముడులు, స్వామివారికి అభిషేకాల అనంత రం సాయంత్రం మకరజ్యోతి దర్శనం జరిగింది. మండపేట ఆలమూరు రోడ్డులో వున్న మాజీ ఎమ్మెల్యే వీవీఎస్ఎస్ చౌదరికి చెందిన అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకర జ్యోతి దర్శనం, ఇరుముడుల సమర్పణ జరిగాయి. అయ్యప్పస్వామికి బూరులతో అభి షేకం చేశారు. స్వామివారిని దర్శించుకున్న అయ్యప్ప భక్తులు ఇరుముడులు సమర్పించారు.

ర్యాలి అయ్యప్ప ఆలయంలో భక్తుల సందడి


ఆలయంలో మకరజ్యోతి దర్శన పూజలు చేసిన దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ర్యాలి ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకర సంక్రాంతిని పుర స్కరించుకుని మంగళవారం స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి అర్చన జరిపి అలంకరించారు. స్వామివారి గ్రామోత్సవం ఘనం గా జరిగింది. సాయంత్రం మకరజ్యోతి దర్శ నం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రఘు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ఆలమూరులో అన్‌స్టాపబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

పోటీ పరీక్షలకు అన్‌స్టాపబుల్ పుస్తకం దోహదం

ఆలమూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అన్‌స్టాపబుల్ పుస్తకం దోహదపడుతుందని వక్తలన్నారు. చింతలూరు గ్రామానికి చెందిన హైదరాబాద్‌లోని ఎడ్యుకేషనల్ డిజైనర్ సంస్థ ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్ నామాల బాలవెంకటసుబ్బారావు రచించిన పుస్తకాన్ని తాను చదువుకున్న పాఠశాల ఆవరణలో అప్పటి గురువుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జేఈఈ మెయిన్, జేఈ అడ్వాన్స్, ఎంసెట్ లాంటి పోటీల పరీక్షలకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మూడవదిగా దీన్ని విడుదల చేశామన్నారు. విద్యార్థులకు సహకరించే పుస్తకాన్ని రచించిన ఆయన్ను పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

అదనపు చార్జీలు వసూళ్లు చేస్తే చర్యలు

రావులపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల అవసరాన్ని అసరాగా తీసుకుని ప్రైవేటు ట్రావెల్ బస్సుల యాజమాన్యాలు అదనపు ధరలు వసూలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా రవాణాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు హెచ్చరించారు. రావులపాలెం ఈతకోట వద్ద జాతీయ రహదారిపై తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అధిక చార్జీల వసూలు తదితర పలు ఫిర్యాదుపై 39 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.1,24,575 అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మోటార్ వాహనాల తనిఖీ అధికారులు రాజేంద్రప్రసాద్, రవికుమార్, లక్ష్మి, శ్రీదేవి, కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఊదలమ్మ అమ్మవారి జాతర

ఆత్రేయపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వెలిచేరు శివారు యుజీ పాలెంలో మంగళవారం రాత్రి ఊదలమ్మ జాతరను జరిపారు. అమ్మవారికి సారె, చీరలను సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్, ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, కవల సత్తిబాబు, ఐనం నాగరాజు, మిద్దే శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనలక్ష్మి అమ్మవారి జాతర

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ గ్రామ దేవత ధనలక్ష్మి అమ్మవారి జాతర ఘనంగా జరిపారు. సత్యవాడ పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.వెర్రిబాబు, రాంబాబు, శేఖర్, శ్రీరామ్‌కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


మండపేటలోనున్న పేరంటాళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు

మండపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని ఏడిద రోడ్డులో ఉన్న పేరంటాళ్లమ్మ అమ్మవారి ఉత్సవాన్ని మంగళవారం జరిపారు. అమ్మవారికి పలువురు ప్రజా ప్రతినిధులు, భక్తులు దర్శించుకున్నారు. ఏడిదలో వున్న చింతాలమ్మ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాల వద్ద విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

జొన్నాడలో ఆకట్టుకున్న సారెకావిళ్లు

ఆలమూరు: ఆలమూరు మండలం జొన్నాడలో పేరంటాలమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి కావిళ్లతో సారె తీసుకెళ్లడం ఆకట్టుకుంది. గ్రామస్తులంతా ఒకేసారి ఊరేగింపుగా కావిళ్లతో అమ్మవారికి పానకం, పిండి వంటకాలు, వస్త్రాలు తీసుకెళ్లి అమ్మవారికి చెల్లించి మొక్కులు తీర్చుకుంటారు. జొన్నాడ గ్రామస్తులతోపాటు మూలస్థానం గ్రామస్తులు సారె సమర్పించి మొక్కు చెల్లించారు.

పసలపూడిలో వెంపర్తమ్మ జాతర

రాయవరం: మండలంలోని పసలపూడి గ్రామస్తుల ఇలవేల్పు వెంపర్తమ్మ జాతరను బుధవారం నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామంలో అమ్మవారి వెండి ఘటాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, నైవేద్యం సమర్పించిన మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పోతంశెట్టి వెంకటరెడ్డి, పోతంశెట్టి తాతారెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పసలపూడి చిన్న తలుపులమ్మ, సోమేశ్వరం దేవాంగుల వీధిలో పోతురాజు తీర్థం, లొల్ల బుల్లిబాపనమ్మ, గోగులమ్మ, కూర్మాపురంలో పోలేరమ్మ, చెల్లూరులో మద్దెమ్మ తల్లి, సత్యెమ్మ జాతరలు జరిగాయి.

వైభవంగా పత్తిపాటమ్మ జాతర

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరులో నున్న పత్తిపాటమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. జాతరలో భాగంగా గరగనృత్యాలు, విచిత్రవేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు, బాజాభజంత్రీలతో పాటు బాణసంచా మధ్య జరిపారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఆలయం వద్ద ఆలయ అర్చకులు ఎర్రమిల్లి నాగవెంకట గురు చరణశర్మ ఆధ్వర్యంలో చండీహోమం జరిపారు. గురువారం ఆలయం వద్ద అమ్మవారి తీర్థం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా రావులమ్మ జాతర

ఆలమూరు: ఆలమూరు గ్రామదేవత రావులమ్మ అమ్మవారి జాతర మంగళవారం రాత్రి జరిగింది. గరగనృత్యాలు, పలు రకాల డప్పుల వాయిద్యాలు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. గరగ నృత్యాల మధ్య అమ్మవారికి గాంధీ బొమ్మ సెంటర్ నుంచి చెరువుగట్టున ఉన్న ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. పెదపళ్ల గ్రామదేవత పోలేరమ్మ జాతర, గవ్వ ఉత్సవాలు జరిపారు. గుమ్మిలేరు గ్రామదేవత ఉరదాలమ్మ జాతర ఉత్సవాలు ఆలయ కమిటీ అధ్వర్యంలో పలు రకాల డప్పుల వాయిద్యాలు, గరగ నృత్యాలతో ఘనంగా జరిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రావులపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్‌సీ ఆధ్వర్యంలో సంక్రాంతి, వేమన జయంతి ఉత్సవాలు పోతంశెట్టి రామిరెడ్డి పార్కు వద్ద జరిపారు. ఇందులో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో సంక్రాంతి సంబరాలు

• యథేచ్ఛగా కోడి పందాలు, గుండాటలు • చేతులు మారిన లక్షలాది రూపాయలు • చోద్యం చూస్తున్న పోలీసు యంత్రాంగం



రామచంద్రపురం మండలం హసన్‌బాద కోడి పందాల ప్రాంగణంలో జబర్దస్త్ నటుల ప్రదర్శన. పక్క చిత్రంలో మండపేటలో కోడి పుంజులతో పందెంరాయుళ్లు

మండపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో కోడిపందాలు, గుండాట, పేకాట తదితర కార్యకలాపాలు యథేచ్ఛగా జరిగాయి. మండపేటతోపాటు, రూరల్‌కు సంబంధించి 4చోట్ల, మండపేట రూరల్‌లో 3చోట్ల కోడి పందాలు, గుండాటలు జోరుగా నిర్వహించారు. వాటి నిర్వాహకుల నుంచి పోలీసులకు ముందుగా ముడుపులు చెల్లించారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ద్వారపూడి, ఏడిద, కేశవరం గ్రామాలతోపాటు మండపేట పోలీసు స్టేషన్ పరిధిలో మారేడుబాకలో 2, మండపేట పట్టణంలో 2చోట్ల కోడిపందాలు, గుండాటలు నిర్వహించగా, లక్షలు చేతులు మారాయి.

విజేతకు హోండా యాక్టివా: మండపేట చెంతనే వున్న మారేడుబాకలో ఒక పందె నిర్వాహకుడు వరసగా 6 పందాలు గెలుపొందిన కపిలేశ్వరపురం మండలం నేలటూరుకు చెందిన వ్యక్తిని విజేతగా ఎంపిక చేసి హోండా యాక్టివ్‌ను బహుమతిగా అందించారు.

ఆలమూరు: మకర సంక్రాంతి వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో రైతులు గోవులకు పూజలు చేశారు. ఆలమూరు మండలం జొన్నాడలో ఆనెం వెంకన్న, ద్వారంపూడి దొరబాబు, చింతలూరులో వాకా గోవిందరాజులు గోవులకు పూలతో అలంకరించి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు.

పెదపళ్లలో పింగ్‌పాంగ్ సూర్య సందడి: పెదపళ్లలో సినీ నటుడు పింగ్‌పాంగ్ సూర్య సందడి చేశారు. గ్రామంలోని బంధువుల ఇంటికి బుధవారం ఆయన వచ్చారు. పెదపళ్ల గ్రామ దేవత పోలేరమ్మ జాతరలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంక్రాంతికి అమ్మవారిని దర్శించుకుంటానన్నారు.

ఆత్రేయపురం: మండలంలో కోడిపందాలు, గుండాట, పేకాటలు యథేచ్ఛగా నిర్వహించగా, వందల కోళ్లు నెలకొరిగాయి. లక్షలాది రూపాయలు చేతులు మారాయి. ఆత్రేయపురం, లొల్ల, వద్దిపర్రు, పేరవరం ర్యాలి గ్రామాల్లో పచ్చని పంటపొలాల్లో బరులను సిద్ధం చేసి మూడు రోజులపాటు విచ్చలవిడిగా జరిపారు. లొల్ల, జోడి పందాల్లో గెలిచిన వారికి నిర్వాహకులు బుల్లెట్లు బహుమతిగా అందించారు.

లొల్లాలమ్మ జాతరలో రికార్డింగ్ డాన్సులు: లొల్ల గ్రామంలో మంగళవారం రాత్రి గ్రామ దేవత లొల్లాలమ్మ జాతరను జరిపారు. జాతరలో భాగంగా రాత్రి ట్రాక్టర్‌పై నలుగురు యువతులు అసభ్యకరంగా డాన్సులు చేస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు.


ద్రాక్షారామ భీమేశ్వర ఆలయంలో గోపూజ చేస్తున్న వేద పండితులు, సిబ్బంది

హసన్‌బాద కోడిపందాల్లో జబర్దస్త్ నటుల సందడి

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం హసన్‌బాదలో సంక్రాంతిని పురస్కరించుకుని జరిపిన కోడిపందాల్లో మంగళవారం మధ్యాహ్నం జబర్దస్త్ నటులు సందడి చేశారు. కోడి పందాలు తిలకించేందుకు ఏర్పాటు చేసిన వేదికపై హాస్య సన్నివేశాలు ప్రదర్శించారు. రైజింగ్ రాజు, దొరబాబు, హరతి, రాంప్రసాద్ బృందం పాల్గొన్నారు. మహిళా యాంకర్ వ్యాఖ్యానంతో హాస్యం పండించారు. ద్వంద్వార్థాలు వచ్చే పంచ్ డైలాగులతో వీరి ప్రదర్శన సాగింది.

వెంకటాయపాలెంలో పందాల బరి వెలవెల: హసన్‌బాద, తాళ్లపొలం, వెల్ల, వెంకటాయపాలెం గ్రామాల్లో కోడిపందాలు. గుండాటలు జోరు గా జరిపారు. హసన్‌బాద, తాళ్లపొలం, వెల్లలో బారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనగా వెంకటాయపాలెంలో కోడి పందాల బరి వెలవెలపోయింది. కె.గంగవరంలో కూడా పందాల బరి ఏర్పాటు చేయడంతో జూదరులు అటువైపు మళ్లారు.

భీమేశ్వర ఆలయంలో గోపూజ: కనుమ పండుగను పురస్కరించుకుని బుధవారం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో గోపూజ చేశారు. ఆలయంలోని మాణిక్యాంబ అమ్మవారి సన్నిధి వద్ద గోవుకు ఆలయ అర్చకులు, వేదపండితుల బృం దం శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకుడు సూరపురెడ్డి వెంకటేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా కోడిపందాలు, గుండాట

రావులపాలెం: మండలంలో కోడిపందాలు, గుండాట, పేకాట జోరుగా సాగాయి. రావులపాలెం, రావులపాడు, ఈతకోట, దేవరపల్లి, గోపాలపురంతో పాటు పలు ప్రాంతాల్లో పెద్ద పెద్ద బరులు ఏర్పాటు చేశారు. ఆయా బరుల వద్ద గుండాట, పేకాట, మూడు ముక్కలాటల కోసం ప్రత్యేక క్యాబిన్‌లు ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో ప్రభల తీర్థం

కె.గంగవరం: దంగేరు పాపమ్మ ఆలయం వద్ద బుధవారం ప్రభల తీర్థం జరిగింది. శివల, దంగేరు, కుడుపూరు తదితర గ్రామాల నుంచి ప్రభలను ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.


ఆత్రేయపురం మండలం లొల్లలో గుండాట

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.గంగవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పామర్రు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.రత్నాలరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పామర్రు, కూళ్ల, కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి, మాచవరం, వాకతిప్ప గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రామచంద్రపురంలో...

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం పట్టణ, మండలంలో రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు తెలిపారు. అత్యవసర మరమ్మతుల్లో భాగంగా చోడవరం, నరసాపురపుపేట, ఓదూరు, ఆరికరేవుల, అగ్రహారం, రైసుమిల్లు, ఆక్వా చెరువులకు శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. ద్రాక్షారామ సబ్‌స్టేషన్‌లో తాళ్లపొలం ఫీడర్ అత్యవసర మరమ్మతుల కారణంగా తాళ్లపొలం, పెద్దతాళ్లపొలం, జెకె పాలెం, నెలపర్తిపాడు, వెలంపాలెం, కుందాలమ్మ చెరువు గ్రామాల్లో 17న ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

ఘనంగా చందనోత్సవం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలోని జెండా వీధిలో ఉన్న హజరత్ మౌలాఅలీ ముష్కిల్‌కుషా దర్గా వద్ద మంగళవారం 39వ గంధోత్సవం జరిపారు. తొలుత చందనపు బిందెతో గ్రామోత్సవం, అనంతరం దర్గా వద్ద ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొని పూజలు జరిపారు.

బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభం


బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎంపీ బోస్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 15(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో అభివృద్ధి చేసిన సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టును రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్, ఆర్బోస్ శీతలపానీయాల సంస్థ అధినేత అడ్డూరి జగన్నాధవర్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ప్రభల ఉత్సవం

రావులపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి జడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రభల ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆయా గ్రామాల్లో ప్రభలకు గ్రామోత్సవం నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి ఉత్సవ్ 2కె25 మెగా సంబరాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపూర్ రైల్వేలైను నిర్మాణం పూర్తి చేయించడంతో పాటు కోటిపల్లి-అయినవిల్లి బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. మంగళవారం రాత్రి రామచంద్రపురరం వీఎస్ఎం కళాశాలలో మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన సంక్రాంతి ఉత్సవ్ 2కె25 మెగా సంబరాల ముగింపులో ఎంపీ హాజరై మాట్లాడారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ 3 రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాల్లో ప్రజలు పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు: రామచంద్రపురంలో మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఉత్సవ్ 2కె25 సంబరాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. మంగళవారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన, అనంతరం జబర్దస్త్ హాస్య సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. ఢీ బృందం నృత్యాలు వీక్షకులను కట్టిపడేశాయి. వ్యాఖ్యాత గణేష్ బృందం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు మంగళవారం రాత్రి వరకు కొనసాగాయి. మంత్రి సుభాష్ ఎడ్ల బండిపై సందడి చేశారు. మెగా హౌసీతో పాటు విజేతలకు మంత్రి తండ్రి సత్యం బహుమతులు అందించారు.


ఎడ్లబండిపై సందడి చేసిన మంత్రి సుభాష్

గనిపోతురాజు జాతర ప్రారంభం

మండపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి) మండపేట మండలం కేశవరం గ్రామంలో ఉన్న శ్రీగనిపోతురాజుస్వామి జాతర బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. నెలఖరు వరకు జరిగే ఈ ఉత్సవాలకు సంబంధించి దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారిని బుధవారం మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎంపీపీ ఉండమట్ల వాసు, పలువురు ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

రాయవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాయవరం, కూర్మాపురం గ్రామాల్లో కోడి పందాలపై పోలీసులు దాడులు జరిపి పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాయవరం శివారు ప్రాంతంలో కోడి పందాలు నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 2 కత్తులు, 2 కోళ్లు, రూ.1180 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కూర్మాపురంలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని 2 కోళ్లు, 2 కత్తులు, 1,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. చెల్లూరు గ్రామంలో పేకాడుతున్న ఇద్దరిని బుధవారం అదుపులోకి తీసుకుని వారి నుంచి 1400 నగదు స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం రాయవరం, కూర్మాపురం గ్రామాల్లో కోడి పందాలు నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 4 కోళ్లు, 4 కత్తులు, రూ.2800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగర సబ్‌స్టేషన్ పరిధిలో ఇండస్ట్రియల్, ఎంహెచ్‌క్యు ఫీడర్‌లైన్లపై చెట్టుకొమ్మలు తొలగించడం, మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు పత్రికా ప్రకటనలో తెలిపారు. సదరు ఫీడర్లు పరిధిలోని కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచర, మాచరమట్టలు, శ్రీరామపురం, వెదురుమూడి, వడమరఖండ్రిక, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.


సంక్రాంతిని పురస్కరించుకుని సందడి చేసిన కుటుంబ సభ్యులు

వాకాడ, వర్రే కుటుంబ సభ్యుల సందడి

కొత్తపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం వాకాడవారిపాలెంలో సంక్రాంతిని పురస్కరించుకుని వర్రే కుటుంబ సభ్యులు ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. విదేశాల్లో స్థిరపడిన వారితోపాటు సుమారు 500 మంది ఈ సంబరాల్లో పాల్గొన్నారు. అబుదాబిలో స్థిరపడిన డాక్టర్ వర్రే పద్మరాజు, డాక్టర్ సంధ్య, అమెరికాలో స్థిరపడిన డాక్టర్ అనిషా, డాక్టర్ అశ్వనిలతో పాటు ఇక్కడ ఉంటున్న వాకాడ గోవిందరావు కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. అరిటాకు భోజనాలతో పాటు తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రధారణతో గడిపారు. పండుగను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో సందడి చేశారు.


ఆత్మీయ సమ్మేళనంలో పామర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కె.గంగవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989-90 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఉల్లాసంగా సాగింది. ఉదయం 9 గంటలకు తాము చదువుకున్న పాఠశాలకు చేరుకున్న పూర్వ విద్యార్థులంతా చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్న అనంతరం తమకు చదువు నేర్పిన గురువులను పలకరించుకున్నారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పిల్లి సూరిబాబు, పల్లి ప్రతాప్‌కుమార్, అనుసూరి గోపాలకృష్ణ, పంపన రాంబాబు, వాసంశెట్టి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాడాల కుటుంబం ఆత్మీయ సమ్మేళనం

కె.గంగవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్ల శివారు మల్లవరం గ్రామంలో తాడాల రామచంద్రుడు, అమ్మాళమ్మ కుటుంబ సభ్యులు ఆత్మీయ కలయిక బుధవారం నిర్వహించారు. వివిధ దేశాల్లో, రాష్ట్రాల్లో డాక్టర్లు, ఇంజ నీర్లు, వ్యాపారులు, ఉద్యోగులుగా స్థిరపడిన వారి కుటుంబ సభ్యులంతా మల్లవరం చేరుకుని సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. ఆత్మీయ కలయిక ఉత్సాహంగా సాగినట్లు వారు తెలిపారు.


ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేసిన కుటుంబ సభ్యులు